క్లుప్తంగా

సినీనటుడు అలీకి సాదర స్వాగతం



అలీకి స్వాగతం పలుకుతున్న ముస్లిం మైనారిటీ నాయకులు

రేణిగుంట: సినీనటుడు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీకి శనివారం రేణిగుంట విమానాశ్రయం వద్ద ముస్లిం మైనారిటీ నాయకులు సాదర స్వాగతం పలికారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, ముజీబ్, రేణిగుంట మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఖదీర్, మెస్ బాబు, షాజహాన్, మస్తాన్ తదితరులు ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

తాగునీటి పైపులైను ఏర్పాటు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలో పాయ్య గ్రామ ఎస్సీ కాలనీలో జోరుగా తాగునీటి పైపులైను ఏర్పాటు పనులు చేస్తున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి దృష్టికి తాగునీటి సమస్యను ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ వాసుదేవ నాయుడు తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.3 లక్షలతో కొత్తగా పైప్‌లైన్ వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పనులు జోరుగా చేస్తున్నారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

శ్రీకాళహస్తి: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని న్యాయవాది మునిశేఖర్ అన్నారు. పట్టణంలోని కొండమిట్ట ప్రాంతంలో దుకాణదారులకు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలను దుకాణాల్లో పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కల్కి ట్రస్టు దౌర్జన్యం

- పేదల భూముల్లో అక్రమంగా కంచె



వరదయ్యపాళెం: మండలంలోని కదూరు కూడలిలో నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో దౌర్జన్యంగా కల్కి ట్రస్టు యాజమాన్యం కంచె ఏర్పాటు చేసింది. దీనిపై కదూరు పంచాయతీ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీలోని 62 మందికి గతంలో ఇంటి స్థలాలు ప్రభుత్వం పంపిణీ చేసింది. కొందరు ఆ భూముల్లో ఇళ్ల నిర్మాణానికి పునాదులు సైతం వేశారు. అయితే ఆ భూములు తమవని కల్కి ట్రస్టు దౌర్జన్యం చేస్తోంది. ఈ విషయమై కదూరు గ్రామస్తులు గతంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతో పాటు కల్కి ట్రస్టు యాజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. తాజాగా శనివారం గుట్టుచప్పుడు కాకుండా సంబంధిత భూముల్లో కంచె ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం మూకుమ్మడిగా వెళ్లి కంచె కోసం నాటిన రాళ్లను తొలగిస్తామని హెచ్చరించారు.

ఘనంగా కుంభాభిషేకం

శ్రీకాళహస్తి: భైరవకోనలోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ కాలభైరవస్వామి, వీరభద్రేశ్వరస్వామి ఆలయాలకు శనివారం ఘనంగా కుంభాభిషేకం నిర్వహించారు. ప్రధానార్చకులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక రూ.90లక్షలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు భాస్కరపేట, గజేంద్రనగర్ ప్రాంతాలకే అర్బన్ హెల్త్ సెంటర్లు పరిమితమయ్యాయన్నారు. ప్రస్తుతం నూతన అర్బన్ హెల్త్ సెంటర్ వల్ల 15 గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. తెలిపారు. 30 ఏళ్లపాటు రాజకీయం చేసిన గోపాలకృష్ణారెడ్డి కుటుంబం పేరుతో ఏర్పాటు విశాలాక్షి నగర్, బృందమ్మ కాలనీలో నిరుపేదలకు ఉపయోగపడేలా తాము అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బుజ్జిరెడ్డి, కంఠా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ వర్క్స్ కాలనీలో పాఠశాల భవనం

పట్టణంలోని బీఎంఆర్ వాటర్ వర్క్స్ కాలనీలో రూ.65లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. టీడీపీ హయాంలో నిర్లక్ష్యంగా పాఠశాలను కూల్చి, విద్యార్థులకు బడి లేకుండా చేశారని, తమ ప్రభుత్వంపిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నూతన పాఠశాలను నిర్మించిందన్నారు.

ఏఈ చేతివాటం..

నాడు–నేడుకు శాపం

మండలంలో నాడు–నేడు పనుల పర్యవేక్షణ అధికారిగా ఉన్న ఇరిగేషన్ ఏఈ రాజేష్ పనితీరుపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేస్తున్న బిల్లులను ఆయన తిరస్కరిస్తుండడంతో పనుల నిర్వహణలో వరదయ్యపాళెం వెనుకంజలో ఉంది. ఇలా అయితే పనులు చేయలేమంటూ ప్రధానోపాధ్యాయులు చేతులెత్తేస్తున్నారు. అంతేకాకుండా ఎంఈఓ సరస్వతి, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజుకు ఫిర్యాదు చేశారు.



నాడు–నేడులో పునాదుల దశలో ఉన్న పాండూరు హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం

- ఇరిగేషన్ ఇంజినీర్ తీరుపై సర్వత్రా విమర్శలు
- ఇంజినీర్ సరఫరా చేసే మెటీరియల్ అయితే బిల్లులు ఓకే!
- హెచ్‌ఎంలు కొనుగోలు చేస్తే మాత్రం కొర్రీలు
- ఇలా అయితే పనులు చేయలేమంటున్న ప్రధానోపాధ్యాయులు
- నాడు–నేడులో వెనుకబడిన వరదయ్యపాళెం మండలం

వరదయ్యపాళెం: మండలంలో రెండవ విడత నాడు–నేడు పథకం కింద 26 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూలు, 9 అంగన్‌వాడీ కేంద్రాలు, 1 జూనియర్ కళాశాల ఎంపికైంది. వీటికి సంబంధించి రూ.3.32కోట్లు ఆయా పాఠశాలల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసింది. అందులో రూ.2.31కోట్లు పనులకు ఖర్చు చేసినట్లు ఆన్‌లైన్‌లో బిల్లులను నమోదు చేశారు. మరో రూ.1.01కోట్లు ఖర్చు చేయాల్సి ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.

రూ.43లక్షల బిల్లులు తిరస్కరణ!

ప్రభుత్వం నాడు–నేడు పనులను వేగవంతం చేయడానికి ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తోంది. ఈ పనులను పర్యవేక్షించేందుకు మండలంలో ఇరిగేషన్ శాఖకు చెందిన ఏఏ రాజేష్‌ను ప్రభుత్వం నియమించింది. అయితే ఆయన నిబంధనలకు భిన్నంగా, వ్యక్తిగతంగా లబ్ధి పొందడానికి ఈ పనులను తనకు అనుకూలంగా మలుచుకోవడం విమర్శలకు తావిస్తోంది. తాను సరఫరా చేసే మెటీరియలే కొనుగోలు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఒత్తిళ్లకు గురిచేయడమే కాకుండా పలు స్కూళ్లకు ఆయనే ఇటుకలు, స్టీలు, ఇతర మెటీరియల్‌ను సరఫరా చేయడం..వాటికి బిల్లులు సైతం వెనువెంటనే మంజూరు చేస్తుండటం గమనార్హం! అయితే ఏఈని కాదని ప్రధానోపాధ్యాయులు కొనుగోలు చేస్తున్న మెటీరియల్‌కు సంబంధించి పలు కారణాలు చూపుతూ బిల్లుల మంజూరు జాప్యం చేయడం, మరికొన్ని బిల్లులను తిరస్కరిస్తుండడంతో హెచ్‌ఎంలకు ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. మండలంలో ఇప్పటివరకు రూ. 43లక్షలకు సంబంధించిన బిల్లులు తిరస్కరణకు గురయ్యాయంటే ఆయన పనితీరు ఎలా ఉందో ఇట్టే బోధపడుతుంది. ఫలితంగా జిల్లాలోనే వరదయ్యపాళెం మండలం నాడు–నేడు పనుల్లో వెనుకకంజలో ఉంది. దీనిపై గత బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ, ఎంఈఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మెజారిటీ పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు ఏఈ రాజేష్ వ్యవహారశైలిపై ఫిర్యాదు చేశారు. తరచూ ఆయన బిల్లులను తిరస్కరించడం మూలాన పనులు వేగవంతం చేయలేకపోతున్నట్టు తేల్చిచెప్పారు. నెలరోజులుగా పనుల పురోగతిలో మండలం వెనుకంజలో ఉండడంతో జిల్లా జాయింట్ కలెక్టర్ సైతం సమీక్షలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులతో మంతనాలు

తన తీరుపై ఉపాధ్యాయులు సమావేశంలో ఫిర్యాదు చేసినట్లు తెలుసుకున్న ఏఈ సంబంధిత ఉపాధ్యాయులతో మంతనాలు చేసినట్లు తెలిసింది. శుక్రవారం పలు పాఠశాలలను సందర్శించిన ఆయన..పనులు వేగవంతం చేయాలని, తిరస్కరణకు గురైన బిల్లులను ఎప్పటికప్పుడు మంజూరు చేస్తానని టీచర్లను శాంతింపజేయడానికి యత్నించినట్లు సమాచారం.

ముందంజలో ఉండేలా చర్యలు

“నాడు–నేడు పనుల విషయంలో ఇరిగేషన్ ఏఈ రాజేష్ వ్యవహారశైలిపై టీచర్లు చేసిన ఫిర్యాదు చేయడం వాస్తవమే. దీనిపై ఎంఈఓ, నేను ఆయన్ను పిలిచి ప్రశ్నించాం. బిల్లులు మంజూరు చేస్తామని, పనులను వేగవంతం చేస్తామని ఆయన చెప్పారు. అన్నీ చక్కదిద్ది, పనుల పురోగతిలో మండలం ముందంజలో ఉండేలా చర్యలు తీసుకుంటాం.”

–సుబ్రమణ్యంరాజు, ఎంపీడీఓ, వరదయ్యపాళెం



పాండూరు కొత్త దళితవాడలో నిర్మాణంలో ఉన్న వంటగది, వర్షానికి కరిగిపోయిన ఇటుకలు

ఎమ్మెల్యేకు ఫిర్యాదు

వరదయ్యపాళెం: నాడు–నేడు పనులలో నిబంధనలకు తుంగలో తొక్కి, పర్యవేక్షణ ఇంజినీర్ రాజేష్ కొన్ని పాఠశాలలకు సరఫరా చేసిన ఇటుకలు, స్టీలు, ఇతర సామగ్రి నాసిరకంగా ఉందని ఇటీవల పెద్ద పాండూరు దళితవాడలో ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో గ్రామస్తులు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు ఫిర్యాదు చేశారు. అక్కడ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణ పనులకు ఉపయోగించిన ఇటుకలు పూర్తిగా వర్షానికి కరిగిపోతున్నాయని ఎమ్మెల్యే ఎదుట ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ దశలోనే ఇటుకలు కరిగిపోతే ఆ గోడలు ఎలా నిలుస్తాయని, ఇలాంటి నిర్మాణాలు ప్రమాదకరమని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందించారు. నాసిరకం మెటీరియల్ సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు అప్పట్లో సూచించారు.

ధర్మమే గెలిచింది



మాట్లాడుతున్న వెంకటాచలపతి

శ్రీకాళహస్తి: ధర్మమే గెలిచిందని శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నేపల్లి వెంకటాచలపతి అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. 2020–21 ఏడాదిలో బార్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఓ న్యాయవాది 2022–23 ఏడాది కూడా ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, అదే పంథా 2023–24లో ఉండటంతో తాను ఎన్నికలు నిర్వహించాలని ఏపీ బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. స్పందించిన బార్‌కౌన్సిల్ మార్చిలో ఎన్నికలు నిర్వహించాలని సురేంద్రబాబును ఎన్నికల అధికారిగా నియమించిదన్నారు. తమ ప్యానల్ సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారని, మిగిలిన వారు దాఖలు చేయకపోవడంతో తమను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సురేంద్రబాబు మార్చి 27న నియామకపత్రం ఇచ్చారన్నారు.అయితే మాజీ అధ్యక్షుడు ఏపీ బార్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయడంతో వారికి అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. తాము రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందంటూ పైవిధంగా హర్షం వ్యక్తం చేశారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

ఏర్పేడు: ప్రజలు సైబర్ నేరగాళ్ల వలలో పడరాదని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వికృతమాలలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు టెక్నాలజీని సాధనంగా చేసుకుని సరికొత్త మోసాలకు పాల్పడతారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆధార్, బ్యాంకు లావాదేవీల వివరాలు అడిగితే సమాచారం ఇవ్వరాదన్నారు. సైబర్ నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఏర్పేడు సీఐ శ్రీహరి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

- రూ.7 లక్షల ఉపకరణాలను అందించిన శివశక్తి ఆశ్రమం



కీళగరం పాఠశాలలో పుస్తకాలు, బ్యాగును ఇస్తున్న శ్రీకుమార్ తదితరులు

నారాయణవనం: పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోని శివశక్తి ఆశ్రమం, చెన్నైలోని శ్రీ దేవినాథ మిషన్ సంయుక్తంగా శనివారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా ఉపకరణాలను అందజేశాయి. నారాయణవనం, నింద్ర, కేవీబీ పురం మండలాలలోని 25 పాఠశాలల్లో చదువుతున్న 1,400 మంది విద్యార్థులకు రూ.7 లక్షల విలువైన నోటుపుస్తకాలను, దుస్తులు, బ్యాగు, ప్యాడ్, వాటర్‌బాటిల్, కలర్ క్రాయన్స్‌ను అందించినట్లు ఆశ్రమ మేనేజింగ్ ట్రస్టీ శ్రీకుమార్ తెలిపారు. 16 సంవత్సరాల క్రితం ఒక్క పాఠశాలతో ప్రారంభించి ఈ ఏడాది 25 పాఠశాలల విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందిస్తున్నామని అన్నారు. పేద విద్యార్థుల పురోగతి చదువుతోనే సాధ్యమన్నారు. నోటు పుస్తకాలను, దుస్తులు, బ్యాగు తదితర ఉపకరణాలను కుటుంబ సభ్యులు, సన్నిహితుల సహకారంతో శ్రీ దేవీనాథ మిషన్ ద్వారా ఏటా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శివశక్తి ఆశ్రమ, శ్రీ దేవీనాథ మిషన్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీకుమార్, కార్తీక్, రాజు, శివ సుబ్రమణియన్, అరుణ, శుభ్రశ్రీ, జయశ్రీ, లలిత, విజయశ్రీ తదితరులు పిల్లలకు ఉపకరణాలను అందజేశారు.

నేడు ఉద్యోగమేళా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది శనివారం తెలిపారు. రేణిగుంట సమీపంలోని డిక్సన్, కార్బన్ పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం ఆదివారం ఉదయం 9గంటలకు ఈ మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో చదివిన వారు అర్హులు, అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, అర్హత పత్రాలు, మార్కుల జాబితా తేవాలని తెలియజేశారు.

జోరుగా అడ్మిషన్లు



కాలేజీలో అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపల్ రమణయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారం రోజుల్లో 52 మంది అడ్మిషన్ పొందారని ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ తెలిపారు. తమ స్కూలులో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, బడి బయట పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నామన్నారు.

జెడ్పీ బాలికల జూనియర్ కాలేజీలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ రమణయ్య తెలిపారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి టీసీలకు వచ్చిన విద్యార్థులను కాలేజీలో చేర్పాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ, గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లెక్చరర్లు సురేంద్ర, రఘువీర్, మార్టిన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై పరాశరేశ్వరుడు




నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో శనివారం సాయంత్రం గజవాహనాన్ని ఉత్సవమూర్తులు అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజా కైంకర్యాలు, పరివార దేవతలకు అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వరుడికి స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవమూర్తులు వివిధ సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించుకుని గజ వాహనాన్ని అధిరోహించి విహరించారు. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేందర్, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆలయానికి చెక్క రథం లేని కారణంతో సర్వభూపాల వాహనసేవను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- క్వారీల యాజమాన్యానికి సత్యవేడు సీఐ హెచ్చరిక

సాక్షి ఎఫెక్ట్..



స్థానికులతో మాట్లాడుతున్న సత్యవేడు సీఐ

వరదయ్యపాళెం: క్వారీల వద్ద నిబంధనల మేరకే బ్లాస్టింగ్‌లు చేయాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సత్యవేడు సీఐ శివకుమార్ రెడ్డి హెచ్చరించారు. మరదవాడ సమీపంలోని ఎన్ఎస్‌పీఆర్ క్వారీలో జరుగుతున్న పేలుళ్లపై ‘క్వారీ..వర్రీ’ శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై సత్యవేడు సీఐ స్పందించారు. శనివారం సాయంత్రం సంబంధిత క్వారీ వద్దకు వెళ్లి యాజమాన్యంతో చర్చించారు. అలాగే బ్లాస్టింగ్ సమయంలో వారు తీసుకుంటున్న భద్రతా ప్రమాణాలను పరిశీలించి పైవిధంగా హెచ్చరించారు. పేలుళ్ల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సేలం ఇళ్లను పరిశీలించారు. విచారణ చేశారు. బ్లాస్టింగ్ సమయంలో రాళ్లు పడుతుండడం గురించి అక్కడ స్థానికులతో మాట్లాడారు. ఇకపై ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే తక్షణమే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా ‘పాండవ విద్యాభ్యాసం’

శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో శనివారం పాండవ విద్యాభ్యాసం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులతో మొక్కులు చెల్లించారు.

ముగిసిన శిక్షణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్వీఏ డిగ్రీ కళాశాల నోడల్ రిసోర్స్ సెంటర్‌లో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధనపై మూడు వారాలపాటు నిర్వహిస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. మూడు విడుతలుగా జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో తిరుపతి జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పనిచేస్తున్న 135 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా క్లాస్‌రూమ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ ఫర్ కంటెంట్ సబ్జెక్ట్ ఇన్‌స్ట్రక్షన్ వంటి వాటిపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.నాగరాజునాయుడు, రిసోర్స్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.నరసింహవర్మ, వైస్ ప్రిన్సిపల్ ఎస్.మురళి, అధ్యాపకులు సత్యనారాయణరెడ్డి, గంగారామ్, జయచంద్రబాబు, రవిప్రసాద్, సతీష్, గిరిజమ్మ పాల్గొన్నారు.

నిబద్ధతతో ‘జగనన్న సురక్ష’



భీమునిచెరువులో సర్వే నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రమీల

- జాయింట్ కలెక్టర్ బాలాజి

శ్రీకాళహస్తి: నిబద్ధతతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించాలని, ప్రతి ఇంటికీ వెళ్లి నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూడాలని జేసీ డీకే బాలాజి అన్నారు. పట్టణంలోని 17వ వార్డు మసీదువీధి ప్రాంతంలో సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. మహిళలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు పొందుతున్నారా, లేదా? అని ఆరా తీశారు. పలువురు తాము పొందిన పథకాల ఫలాల గురించి ఆయనకు తెలియజేశారు. అన్ని పథకాలు పొందుతున్నామని, ఎలాంటి సమస్యలూ లేవని వారు చెప్పారు. వివాహ, కుల, ఆధార్‌లో ఏవైనా సమస్యలు వుంటే పరిష్కరించుకోవాలనుకుంటే వాటికి సంబంధించి టోకెన్లు ఇస్తారని జేసీ వారికి తెలిపారు. అనంతరం పలు ఇళ్లల్లో ఆయన సర్వే నిర్వహించారు. ఏవైనా ధృవపత్రాలు లేకుంటే వారం రోజుల్లో సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలతో కూడిన క్యాలెండర్ ప్రతి ఇంటికీ ఇవ్వాలని ఉద్యోగులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు రూప్‌చంద్, మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే ప్రారంభం

నారాయణవనం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటా అందుతున్న ప్రభుత్వ సేవలు, పథకాల సర్వే మండలంలోని భీమునిచెరువు సచివాలయ పరిధిలో శనివారం ప్రారంభించారు. ఎంపీడీఓ గుణశేఖర్, తహసీల్దార్ ప్రమీల పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటా వెళ్లి సర్వే చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, భీమునిచెరువు, డీకే పాళ్యం, బ్రాహ్మణతాంగాళ్ పంచాయతీల పరిధిలోని 722 గృహాల సర్వే లక్ష్యంగా 5 హ్యాబిటేషన్లలోని 12 క్లస్టర్లలో సర్వే ప్రారంభించి సాయంత్రానికి 512 గృహాల సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. అర్హత ఉండి సేవలు, పథకాలు అందని వారికి జూలై 1వ తేదీ శనివారం సచివాలయంలో నిర్వహించే జగనన్న సురక్ష సదస్సులో వారి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. సర్వేలో సర్పంచ్‌లు మురుగేశం, గుణశేఖర్, స్వర్ణ, పంచాయతీ కార్యదర్శులు లీలావతి, కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బుచ్చినాయుడుకండ్రిగ: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు హనుమాన్‌నాయక్

‘జగనన్న సురక్ష’తో అర్హుల చెంతకే సంక్షేమం

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి సైతం లబ్ధి కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనివల్ల అర్హుల చెంతకే సంక్షేమం చేరుతుందని తహసీల్దారు హనుమాన్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం జగనన్న సురక్ష పథకంపై మండంలోని ఆర్.అనంతాపురంలో ఆయన గ్రామసభ నిర్వహించారు. జూలై 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జగనన్న సురక్షను మండలంలోని 14 సచివాలయాల పరిధిలో నిర్వహిస్తామన్నారు. వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి, జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఏ సేవలను ఉచితంగా అందిస్తారనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యాంపు నిర్వహించే రోజున ప్రజలకు వారికి కావాల్సిన ధ్రువపత్రాలను తీసుకొచ్చి ఇవ్వాలన్నారు. 11 రకాల ప్రభుత్వ సేవలను ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఓ ప్రసాద్, సర్పంచులు ప్రకాష్‌నాయుడు, వెంకటేష్, వీఆర్‌ఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యం.. సమ్మోహనం



భరత నాట్య ప్రదర్శన చేస్తున్న శ్రీవర్షిత, హాజరైన గ్రామస్తులు

సత్యవేడు: శ్రీసిటీ సాహిత్య ఆధ్యాత్మిక వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో చిన్నారి శ్రీ వర్షిత భరత నాట్య ప్రదర్శన ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేసింది. గణేష ప్రార్థనతో తన నృత్య ప్రదర్శనను ప్రాంభించిన శ్రీ వర్షిత ఆపై పలు భక్తి గీతాలకు తాళం, లయ, భంగిమ, అభినయంతో సమ్మోహితుల్ని చేసింది. శ్రీసిటీ–శ్రీవాణి నిర్వాహకులు శ్రీవర్షితకు జ్ఞాపికను అందజేశారు. శ్రీసిటీ పరిధిలోని ఆరూరుకు చెందిన అరుళ్, పూంగుణి దంపతుల కుమార్తె శ్రీవర్షిత నృత్య ప్రదర్శనను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, శ్రీసిటీ ఉద్యోగులు హాజరయ్యారు. నాట్య ప్రదర్శనకు ముందు శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో ఎంపీ శ్రీకాంత్ షిండే



ఎంపీ శ్రీకాంత్ షిండేతో ఎమ్మెల్యే తదితరులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం మహారాష్ట్ర సీఎం ఏకనాథ్ షిండే తనయుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, టీటీడీ పాలకమండలి సభ్యులు సౌరవ్, రాజేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి చేరిక



ఏర్పేడు: మండలంలోని కృష్ణంపల్లెలో టీడీపీ నుంచి పలువురు నాయకులు వైఎస్సార్‌పీలోకి చేరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు శనివారం శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ యార్డు సభ్యుడు గంగయ్య యాదవ్ టీడీపీకి చెందిన చంద్రారెడ్డి, ఉదయ్ తదితర నాయకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు చెప్పారు.